సాక్షి
నిజామాబాద్
శనివారం ׀ 23 ׀ సెప్టెంబర్ ׀ 2023



విఘాతం కలిగిస్తే చర్యలు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ సత్యనారాయణ హెచ్చరించారు.

- 8లో ▸



గణనాథుడికి పూజలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో ఘనంగా జరుగుతున్నాయి. మండపాల్లో విఘ్నేశుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /22.0

వాతావరణం

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

27న నిధి ఆప్కే నికట్

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో పీఎఫ్ చందాదారుల సమస్యలు పరిష్కరించేందుకు నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని ఈ నెలా 27న నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రం వందేమాతరం స్కూల్‌లో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్ శ్రవణ్‌కుమార్, కామారెడ్డి జిల్లా పాత రాజంపేట శాంతినికేతన్ విద్యాలయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికట్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పీఎఫ్ చందాదారులు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని పీఎఫ్ కమిషనర్ కోరారు.

న్యాక్ అక్రెడిటేషన్ కోసం కృషి చేయాలి



తెయూ(డిచ్‌పల్లి) : ఉన్నత విద్యాసంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థికపరమైన మద్దతుకు న్యాక్ అక్రెడిటేషన్ తప్పనిసరి అయిందని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి పేర్కొన్నారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి శుక్రవారం న్యాక్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పనకు, బోధన సిబ్బంది, పరిశోధకులకు అవసరమైన ప్రాజెక్టుల నిర్వహణకు, ల్యాబ్‌ల ఏర్పాట్లకు న్యాక్ గుర్తింపు తప్పనిసరి అయిందన్నారు. న్యాక్ అక్రెడిటేషన్ గుర్తింపు కోసం బోధన, బోధనేతర సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేయాలని రిజిస్ట్రార్ యాదగిరి కోరారు.

ఆలయాలకు యాదాద్రీశుడి నిధులు

యాదగిరిగుట్ట: కామారెడ్డి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి రూ.5 కోట్ల నిధులు ఇవ్వాలని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయం నుంచి మరో రూ. 5 కోట్లు కేటాయించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఈనెల 14వ తేదీనే దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వుల కాపీని యాదాద్రి ఆలయాధికారులకు పంపించారు. ఈ విషయం ఆలస్యంగా బయటకు రావడంతో ఉత్తర్వుల కాపీని సోషల్ మీడియాలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వైరల్ చేస్తున్నారు. యాదాద్రి ఆలయ నిధులను కామారెడ్డి నియోజకవర్గానికి తరలించడాన్ని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె ప్రవీణ్ కుమార్ ఖండించారు. సీఎం కేసీఆర్ పోటీ చేయబోయే కామారెడ్డికి రూ.5 కోట్లు విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మాజీ సైనికులు రిటైల్ పెట్రోల్ పంప్ డీలర్ షిప్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేష్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ నెల 27లోగా అర్హత కలిగిన మాజీ సైనికులు డీలర్‌షిప్ కోసం https://www. petrolpumpdealerchayan.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అటవీ అధికారులపై దాడి

రామారెడ్డి: రంగురాళ్లు తరలించిన ట్రాక్టర్‌ను సీజ్ చేసే క్రమంలో అటవీశాఖ అధికారులపై కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం భట్టు తండాలో ఐదుగురు వ్యక్తులు దాడి చేశారు. అటవీశాఖ సెక్షన్ అధికారి శంకర్ దాడి ఘటనపై రామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్టు 31న రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న అటవీశాఖ అధికారులకు రంగురాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో పట్టుకునే ప్రయత్నం చేశారు. నిందితులు ఆరు రంగురాళ్ల సంచులను అక్కడే వదిలేసి ట్రాక్టర్‌తో సహా తప్పించుకుని పారిపోయారు. శుక్రవారం ట్రాక్టర్‌ను భట్టుతండాలో గుర్తించిన అటవీశాఖ అధికారులు సీజ్ చేసే క్రమంలో నిందితులు దూషిస్తూ కట్టెలతో దాడికి దిగారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

ఇన్‌చార్జి డీఈగా వెంకటరమణ

నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖలో ఇన్‌చార్జి డీఈ(టెక్నికల్)గా వెంకటరమణ అదనపు బాధ్యతలు స్వీకరించనున్నారు. డీఈ రమేష్ రెండు నెలల పాటు సెలవులో వెళ్లారు. దీంతో కన్‌స్ట్రక్షన్ డీఈ వెంకటరమణకు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ఎస్ఈ రవీందర్‌రావు తెలిపారు.

కొత్త రాతియుగం ఆనవాళ్లు

ఉమ్మెడలో లభ్యం..

- వాటికి సమీపంలో రెండుచోట్ల కల్యాణి చాళుక్యుల శాసనాలు
- ఖగోళ భావనలను తెలిపేలా కొత్తరాతియుగం నాటి రాతిబొద్దులు
- సూర్యచంద్రులు, ఆవు, దూడ, శివలింగం చిత్రాలతో కల్యాణి చాళుక్యుల శాసనాలు

నందిపేట మండలం ఉమ్మెడ గ్రామం వద్ద గోదావరి ఒడ్డున 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' సభ్యుడు బలగం రామ్మోహన్ స్థానికుల సహకారంతో కొత్త రాతియుగం ఆనవాళ్లను, వాటికి సమీపంలో మరో రెండు చోట్ల కల్యాణి చాళుక్యుల శాసనాలు కనుగొన్నారు. కొత్తరాతియుగం ఆనవాళ్లకు సంబంధించి నూరుడు గుంటలు, రాతి బొద్దులను గుర్తించారు. ఈ అంశాలను చరిత్ర పరిశోధకులు డాక్టర్ రామోజు హరగోపాల్ డీకోడ్ చేసి, విశ్లేషించి విశదీకరించారు. 6 వేల ఏళ్ల కిందట రాతిపనిముట్లతో పదును పెట్టుకున్న నూరుడు గుంటలను (గూవ్స్), 4,500 ఏళ్ల నాటి పెద్దరాతి యుగం నాటి ఖగోళ భావనలను తెలిపే రాతిబొద్దుల సముదాయాన్ని (కప్‌మార్క్స్), చరిత్ర బృందం పరిశోధకులు అన్వేషించారు.



ఉమ్మెడ-1 శాసనం



ఉమ్మెడ-2 శాసనం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉమ్మెడ సమీపంలో కాలభైరవస్వామి గుట్ట చుట్టూ రాతిగుండ్లు, సహజ సిద్ధమైన రాళ్ల పేర్పుతో ఏర్పడిన గుహలున్నాయి. పరుపుబండ రాళ్లున్నాయి. ఒక పరుపుబండ మీద 23 రాతి బొద్దులు ఉన్నాయి. వీటి అమరిక నక్షత్రరాశిని సూచించే విధంగా ఉంది. ఇవి 4 వేల సంవత్సరాల కిందటి బృహచ్ఛిలాయుగానివిగా భావిస్తున్నట్లు చరిత్రకారుడు కేపీ రావు తెలిపారు. అయితే ఇంకా పాతవైనా కావచ్చని చరిత్ర బృందం భావిస్తోందన్నారు. కాగా ఇక్కడికి సమీపంలోనే మరో చోట కూడా కొత్త రాతియుగపు రాతిబొద్దులున్నాయి. ఇక్కడ 6 వేల సంవత్సరాల కిందటి కొత్త రాతియుగానికి చెందిన నూరుడు గుంటలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇవి ఉమ్మెడలో వేల సంవత్సరాలుగా జనావాసాలు ఉన్నాయని చెప్పేందుకు నిదర్శనాలన్నారు. వీటితో పాటు ఇక్కడ రాతిపై చెక్కిన చిహ్నాలు లభించాయి. కొత్తరాతియుగం ఆనవాళ్లు చరిత్ర పూర్వయుగ సంస్కృతికి నిదర్శనమని రామోజు హరగోపాల్ పేర్కొన్నారు.

■ ఉమ్మెడ శాసనం–2

ఈ శాసనాన్ని 1వ జగదేకమల్లుని కాలంలో వేశారు. దీన్ని గణపతి గుండు శాసనంగా చరిత్ర బృందం తెలిపింది. దీన్ని ఉమ్మెడ శివారులోని కాలభైరవస్వామి ఆలయం సమీపంలో కనుగొన్నారు. 3 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పుతో, 20 పంక్తులలో దీన్ని రాశారు. ఈ 2వ ఉమ్మెడ శాసనాన్ని 1వ జగదేకమల్లు పాలనాకాలంలో శక సంవత్సరం 939, పింగళ సంవత్సరాది, ఆశ్వయుజ శుద్ధ షష్టి ఆదివారం అనగా క్రీ.శ.1,017 సెప్టెంబరు 29న మండలేశ్వరుడు కొంగుణవమ్మకు ధర్మువుగా మహారాజ గోపాలపురం నందగిరినాథునికి, మయూరపింఛధ్వజ లాంఛనం గల కుమారమల్లుడు, అంకకారుడు, సోమరస, యమ, నియమ, స్వాధ్యాయ, ధ్యాన, సమాధి సంపన్నుడైన ప్రసన్నాచార్యునికి గురుదక్షిణగా మెట్టభూమి, తరిభూమిని దానం చేసినట్లు వివరింబడింది. అష్టాంగయోగ నిరతుడైన గురువు గురించి చెప్పే పంక్తులు బాసర కాలాహనుమాన్ శాసనంలో కూడా ఉన్నాయి. సాధారణంగా జైన గురువులను వర్ణించే క్రమంలో ఈ మాటలను పేర్కొంటారని చరిత్ర బృందం తెలిపింది.

ఉమ్మెడ-2 శాసనం ఉన్న రాతిగుండుపై గోడ, కప్పు నిర్మించడంతో కొంత శాసనభాగం మరుగున పడిపోయింది. ఈ గుండుపై ఉన్న శాసనం కింద గణపతి, నాగశిల్పం ఉన్నాయి. కుడి పక్కన రాష్ట్రకూట శైలి నాగ వీరుని శిల్పం ఉంది. ఇక్కడ స్థానిక ప్రజలు ప్రతి సోమవారం పూజలు చేస్తున్నారు. ఇక్కడి గణపతి కుడివైపు తొండంతో రాష్ట్రకూట శైలిలో ఉన్నాడు. దీన్ని జైన గణపతి అనొచ్చని రామోజు హరగోపాల్ తెలిపారు. ఉమ్మెడ వద్ద లభించిన రెండు శాసనాల్లో సూర్య, చంద్రులు, ఆవుదూడ, శివలింగం ఉన్నాయి. ఇప్పటివరకు ప్రచురితమైన నిజామాబాద్ జిల్లా శాసన సంపుటిలో ఈ శాసనాలు లేవని, ఇవి కొత్తగా కనుగొనబడినవని చరిత్ర బృంద సభ్యులు వివరించారు. కొత్త తెలంగాణ చరిత్ర బృందానికి ఉమ్మెడ సర్పంచ్ పోశెట్టి, యువజనసంఘం బాధ్యుడు బచ్చ సాయిరెడ్డి సహకరించారు.



ఉమ్మెడ వద్ద కొత్తరాతియుగం ఆనవాళ్లు, ఖగోళ భావనలను తెలిపే రాతిబొద్దులు



గుడి



శాసనం గుండు కింద వినాయకుడి విగ్రహం



ఆనవాళ్లు కనుగొన్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం, గ్రామస్తులు

ఉమ్మెడ శాసనం-1

ఉమ్మెడ వద్ద ప్రాచీన ఉమామహేశ్వరాలయానికి 100 మీటర్ల దూరంలో కొత్తగా మరో రెండు కల్యాణి చాళుక్య శాసనాలను గుర్తించారు. ఈ శాసనాన్ని 5వ త్రిభువనమల్ల విక్రమాదిత్యుడు వేయించినదిగా గుర్తించారు. 17 పంక్తులున్న ఈ శాసనంలో లిపి తెలుగన్నడం (తెలుగు అర్థాన్నే కన్నడ భాషలో) ఉంది. ఉమ్మెడ కాలభైరవ స్వామి ఆలయం సమీపంలో రాతి గుండుపై 5 అడుగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తులో వేశారు. దీన్ని 5వ త్రిభువనమల్ల విక్రమాదిత్యుడు 1,008–1,014 సంవత్సరాల మధ్య వేయించగా, శాసనదాతగా ప్రధానమంత్రి పల్లవరస వ్యవహరించారు. దీని ప్రకారం కాలం (శక సంవత్సరం 933 ఫాల్గుణ మాస సోమగ్రహణ సందర్భం, 1,012 ఫిబ్రవరి 10 ఆదివారం)గా ఉంది. సత్యరత్నాకర బిరుదాంకితుడైన ప్రధానమంత్రి పల్లవరస, సోమరస పుణ్యం కోసం ఫాల్గుణ మాస పౌర్ణమి చంద్రగ్రహణ సందర్భంగా సోమనాథుని కాళ్లు కడిగి 60 మర్తురుల భూమిని భట్టవృత్తిగా, సర్వనమస్యం (సకలజన పూజనీయం)గా దానం చేసినట్లు ఈ శాసనంలో వివరించబడిందని శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. 5వ త్రిభువనమల్ల విక్రమాదిత్యుని శాసనం మరొకటి సంగారెడ్డి జిల్లా నందికందిలో లభించింది. ఉమ్మెడ శాసనం అతని పేరిట రెండో శాసనం అవుతుంది.

ఆసియా గేమ్స్‌కు 'ఇందూరు' బిడ్డలు!

- బాక్సింగ్‌లో తలపడనున్న నిఖత్ జరీన్
- ఫుట్‌బాల్‌లో గుగులోత్ సౌమ్య

నిజామాబాద్‌నాగారం : ఆసియా క్రీడల్లో ఇందూరు కీర్తి పతాకం రెపరెపలాడనుంది. జిల్లా క్రీడాకారులు నిఖత్ జరీన్, గుగులోత్ సౌమ్య ఈ మెగా టోర్నీలో ఆడనున్నారు. పంచ్‌లతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ.. పతకాలను సొంతం చేసుకుంటూ ముందుకు వెళ్తున్న నిఖత్.. చిరుతలా పరుగెడుతూ గోల్స్ కొట్టే ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోత్ సౌమ్య ఈ టోర్నీకి ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్‌జౌస్ నగరంలో ఈ క్రీడలు జరగనున్నాయి.



మొదటిసారి పాల్గొంటున్నా

నేను మొదటి సారి ఆసియా గేమ్స్‌లో పాల్గొంటున్నా. ఈ టోర్నీలో ఆడటం నా కల. ఇందుకోసం చాలా కష్టపడ్డాను. గతంలో అంతర్జాతీయ టోర్నీల్లో ఆడే అవకాశం వచ్చినా, గాయాలతో ఇబ్బంది పడ్డాను. రెండు, మూడు టోర్నీలు మాత్రమే ఆడాను. ఈ టోర్నీలో సత్తా చాటుతా.

– గుగులోత్ సౌమ్య, ఫుట్‌బాల్ క్రీడాకారిణి

పతకం సాధిస్తా..

మొదటిసారి ఆసియా గేమ్స్‌లో పాల్గొంటున్నా. 50 కేజీల విభాగంలో బరిలో దిగుతున్నా. ఈ క్రీడల్లో పతకం సాధించి ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తా. దీనికోసం నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్నా.

– నిఖత్ జరీన్, బాక్సింగ్ క్రీడాకారిణి



పదోన్నతుల జాబితాలో అవకతవకలు!

- లిస్టులో రెండు సార్లు ప్రమోషన్ తిరస్కరించిన వారి పేర్లు
- 60 మంది అనర్హులకు డిక్లరేషన్ ఇచ్చింది 20 మందే..
- నాట్‌విల్లింగ్ రికార్డులు నిర్వహించని విద్యాశాఖ

నిజామాబాద్‌అర్బన్ : విద్యార్థులు పాఠాలు చెప్పే గురువులే దారి తప్పుతున్నారు. పదోన్నతుల కోసం నిబంధనలను తుంగలో తొక్కి అక్రమాలకు పాల్పడుతున్నారు. గతంలో రెండు సార్లు పదోన్నతి తిరస్కరించిన వారికి ఇప్పుడు ప్రమోషన్ పొందే అవకాశం లేకున్నా అధికారులను మచ్చిక చేసుకొని సీనియారిటీ జాబితాలో చోటు సంపాదించారు. జిల్లా విద్యాశాఖ ఫిబ్రవరిలో విడుదల చేసిన ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం తాత్కాలిక సీనియార్టీ జాబితాలో ఓపెన్ కేటగిరీలో వరుస సంఖ్య 59 ఉన్న ఒక ఉపాధ్యాయుడు గతంలో రెండుసార్లు పదోన్నతి తిరస్కరించినట్లు పేర్కొన్నారు. ఆ లెక్కన ఆయనకంటే ముందున్న 58 మంది కూడా పదోన్నతి తిరస్కరించినట్లే. కానీ ప్రస్తుతం వారిని కూడా సీనియారిటీ జాబితాలో చేర్చారు. జిల్లా విద్యాశాఖ రెండుసార్లు పదోన్నతి తిరస్కరించిన ఉపాధ్యాయుల జాబితాను రెండు దశాబ్దాలుగా సరిగా నిర్వహించడం లేదు. 2005, 2009, 2013 పదోన్నతుల్లో 1998 డీఎస్సీకి చెందిన చాలామంది ఉపాధ్యాయులు రెండు సార్లు నాట్ విల్లింగ్ ఇచ్చారు.



డీఈవో కార్యాలయంలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

అయినా కూడా ఈ మధ్య విడుదల చేసిన తాత్కాలిక జాబితాలో వారికి చోటు కల్పించారు. దీనిపై ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు రావడంతో స్పందించిన విద్యాశాఖ డిక్లరేషన్ కోరింది. గతంలో రెండు సార్లు నాట్ విల్లింగ్ ఇచ్చిన వారు డిక్లరేషన్ ఇచ్చి తప్పుకోవాలని కోరగా 20 మాత్రమే ఇప్పటి వరకు ఇచ్చారు.

60 మంది అనర్హులు!

జిల్లా విద్యాశాఖ గత ఫిబ్రవరి, సెప్టెంబర్ మొదటి వారంలో విడుదల చేసిన తాత్కాలిక జాబితాల్లో చాలామంది ఉపాధ్యాయులు రెండుసార్లు నాట్ విల్లింగ్ ఇచ్చినట్లు పేర్కొంది. కానీ వారం క్రితం విడుదల చేసిన తాత్కాలిక జాబితాలో రెండుసార్లు నాట్ విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులను మరల చేర్చారు. ఈ జాబితాలో దాదాపు 60 మంది అనర్హులున్నట్లు సమాచారం. విద్యాశాఖకు అందుబాటులో గల పదోన్నతుల రికార్డులు పరిశీలిస్తే ఏ ఉపాధ్యాయుడి వరకు పదోన్నతి వచ్చిందో ఎన్నిసార్లు వచ్చిందో తెలుసుకోవచ్చు. కానీ విద్యాశాఖ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా అనర్హులైన టీచర్ల నుంచి డిక్లరేషన్ తీసుకొని మమ అనిపించారు. రంగారెడ్డి జిల్లా అధికారులు ఈ విధంగా తప్పు చేయడంతోనే హైకోర్టు ఆ జిల్లాలో పదోన్నతులపై స్టే ఇచ్చింది. 2009లో విడుదలైన ఉత్తర్వుల ప్రకారం రెండు సార్లు పదోన్నతి తిరస్కరించిన వారు మళ్లీ ప్రమోషన్ పొందడానికి అనర్హులు. దీని ప్రకారం జిల్లా విద్యాశాఖ అధికారులు రెండుసార్లు పదోన్నతి తిరస్కరించిన వారి జాబితాను సిద్ధం చేసి సంబంధిత టీచర్ల సర్వీస్ బుక్‌లో నమోదు చేయాలి. కానీ అలా చేయలేదు.

మచ్చిక చేసుకొని..

బదిలీలు, పదోన్నతులు సక్రమంగా నిర్వహించడానికి సీనియర్ ప్రధానోపాధ్యాయులతో డీఈవో ఒక కమిటీ వేశారు. కొందరు టీచర్లు కమిటీ సభ్యులను మచ్చిక చేసుకున్నట్లు తెలిసింది. దీంతో వారు సర్వీస్ బుక్‌లను సక్రమంగా చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సీనియారిటీ జాబితా వివరాలు కూడా కమిటీ సభ్యులే నిర్ధారిస్తున్నారు.

చర్యలు ఉంటాయి

బదిలీలు, పదోన్నతుల కోసం తప్పుడు పత్రాలు సమర్పించిన వారిపై చర్యలు ఉంటాయి. సర్వీస్ బుక్‌లోని వివరాలు తప్పుగా చూపించిన ఊరుకునేది లేదు. ప్రక్రియ సజావుగా సాగుతోంది. టీచర్లు అందరు నిబంధనల ప్రకారమే దరఖాస్తు చేసుకోవాలి. డిక్లరేషన్ ఇవ్వని టీచర్లు ఉంటే ఇవ్వాలి. – దుర్గాప్రసాద్, డీఈవో

వామ్మో.. డెంగీ

- నగరంలో పెరుగుతున్న కేసులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ కార్పొరేషన్‌లో సమస్యలు తాండవం చేస్తున్నాయి. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దీంతో నగర ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. కాలనీల్లో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. కనీస సౌకర్యాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నగరంలో 60 డివిజన్ల పరిధిలో 4.96లక్షల జనాభా ఉంది. నిజామాబాద్ నగరంలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 90, జిల్లా వ్యాప్తంగా 188 డెంగీ కేసులు నమోదయ్యాయి. గ్రామాలతో పోల్చుకుంటే పట్టణాల్లో కాస్త శుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. కానీ పల్లెల్లో కన్నా పట్టణాల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కావడం అందరిలో కలవర పెడుతోంది.



జీజీహెచ్‌లో రోగులు

పర్యవేక్షణ లోపం

నగరంలోని కాలనీల్లో చెత్త సక్రమంగా తొలగించడం లేదు. డ్రెయినేజీల్లో చెత్త పేరుకు పోయి మురుగు రోడ్లపై పారుతోంది. ఓపెన్ ప్లాట్లు మురికి కూపాలుగా మారాయి. దీంతో దోమలు పెరిగి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతోనే పరిస్థితి ఇలా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలో ప్రతి ఇంట్లో విషజ్వరాల బాధితులు ఉన్నారు. టైఫాయిడ్, మలేరియాతో పాటు డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రి అని తేడా లేకుండా డెంగీతో అడ్మిట్ అయ్యేవారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది.

నగరంలోని శాంతినగర్ కాలనీకి చెందిన మహీక్ ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆ బాలిక 10 రోజులుగా జ్వరంతో బాధ పడుతోంది. జ్వరంతో పాటు చేతులు కాళ్లు ఎర్రగా మారి వాపు వచ్చింది. ఆర్ఎంపీకి చూయించుకున్న తగ్గలేదు. దీంతో ఈ నెల 18న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తల్లితో కలిసి వచ్చింది. అన్ని రకాల టెస్ట్‌లు చేయడంతో డెంగీ పాజిటివ్ వచ్చింది. నాలుగు రోజులుగా ఇక్కడే చికిత్స తీసుకుంటుండటంతో ఆరోగ్యం కుదుట పడింది.



నగరంలోని బొబ్బిలి వీధికి చెందిన సావిత్రికి వారం రోజులుగా జ్వరం ఉంది. ఆర్ఎంపీ దగ్గర చూపించుకొని మందులు వాడిన తగ్గలేదు. దీంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వచ్చారు. రక్తపరీక్షలు చేయడంతో డెంగీగా తేలింది.



నగరంలోని గాయత్రినగర్‌కు చెందిన కవితకు జ్వరం వచ్చింది. మందులు వాడినా తగ్గకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకవచ్చారు. పరీక్షల్లో డెంగీగా నిర్ధారణ అయింది.

రెవెన్యూ మండలంగా రామడుగు

- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

ధర్పల్లి: 'రామడుగు' గ్రామాన్ని కొత్త రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తూ ప్రభుత్వం ప్రాథమికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ధర్పల్లి మండలంలో రామడుగు కొనసాగుతున్నది. దీని పరిధిలో డిచ్‌పల్లి మండలంలోని కొరట్ పల్లి, సుద్దులం, ధర్పల్లి మండలంలోని రామడుగు, మైలారం, కేసారం, చల్లగర్గే, కొనాయిపల్లి మొత్తం ఏడు గ్రామాలను చేరుస్తూ కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న రామడుగు మండలం నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో కొనసాగుతుందన్నారు. రెవెన్యూ మండల ఏర్పాటు ప్రతిపాదనపై సంబంధిత ప్రాంతాల ప్రజలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోపు లిఖితపూర్వకంగా తమకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

సైన్స్‌ బిల్డింగ్‌ను తనిఖీ చేసిన రిజిస్ట్రార్‌



తెయూ(డిచ్‌పల్లి): తెయూ క్యాంపస్‌ ఆవరణలో రూసా నిధులతో చేపట్టిన సైన్స్‌ బిల్డింగ్‌ నిర్మాణ పనులను శుక్రవారం రిజిస్ట్రార్‌ యాదగిరి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు కొన్ని సూచనలు చేశారు. ఆయన వెంట స్టేట్‌ ఎడ్యుకేషన్‌ వెల్ఫేర్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ దేవదాస్‌, వర్సిటీ ఇంజినీర్‌ వినోద్‌, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన జెడ్పీటీసీలు



నిజామాబాద్‌నాగారం: రాజ్యసభలో మహిళా బిల్లు ఆమోదం పొందడంతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జిల్లా మహిళా జెడ్పీటీసీలు హైదరాబాద్‌ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో జెడ్పీటీసీలు గడ్డం సుమనా రెడ్డి, రజితాయాదవ్‌, భారతి, లావణ్య, సుమలత, లక్ష్మి, నర్సమ్మ, యమున, తనూజ, వైశాలిసీరెడ్డి, లక్ష్మీ, బుచ్చమ్మ, జెడ్పీచైర్మన్‌ దాదాన్నగారి విఠల్‌రావు, డీసీసీబీ బ్యాంక్‌ డైరెక్టర్‌ గిర్దావర్‌ గంగారెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌లో ఉషూ క్రీడకు సంబంధించిన ఎంపికలు కలెక్టరేట్‌ మైదానంలో శుక్రవారం నిర్వహించారు. క్రీడల కార్యదర్శి సంగీత్‌రావు ఆధ్వర్యంలో ఎంపికలు చేపట్టారు. అండర్‌–17 బాలబాలికలకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



మాక్లూర్‌: మండలంలోని కల్లెడి గణపతుల వద్ద అన్నదానానికి శుక్రవారం ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి తరపున మాక్లూర్‌ వైస్‌ ఎంపీపీ సుక్కి సుజాతాసుధాకర్‌కు 12 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. గ్రామంలో నెలకొన్న ప్రతి గణపతి మండపానికి బియ్యం అందిస్తామని సుధాకర్‌ పేర్కొన్నారు. అన్నిదానాల్లోకెళ్ల అన్నదానం గొప్పదని భావించి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మండలంలోని అన్ని గ్రామాలకు బియ్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్‌ గణేశ్‌..





పర్యావరణాన్ని కాపాడే రీతిలో ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్‌ కమ్యూనిటీ, యువజన సంఘాల మండపాలు, ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సంబంధించి 'సాక్షి' సెల్ఫీలు ఆహ్వానిస్తోంది. ఆసక్తిగలవారు వినాయక ప్రతిమలతో సెల్ఫీలు దిగి కింది నంబరుకు వాట్సాప్‌ చేయగలరు.

పంపించాల్సిన వాట్సాప్‌ నెం.
8978036828



బాల గణేశ్‌ మండలి (గాదేపల్లి)



టి. అభినయ్‌, ఆలూరు



సునీల్‌జాదవ్‌, వినాయక్‌నగర్‌



శ్రీజ్ఞాన్‌రెడ్డి, గాదేపల్లి



గాంధీ, గోపూరు



గాదేపల్లి గణేశ్‌ మండలి ఆధ్వర్యంలో..



శ్రీ శివపుత్ర గణేశ్‌ మండలి (శివాజీనగర్‌)



శ్రీసార్వజనిక్‌ గణేశ్‌ మండలి (సాలూర)



శ్రీనివాస్‌, నిజామాబాద్‌



రవి, పురాణిపేట, భీమ్‌గల్‌



చిన్నవాల్గోట్‌లో..



సంజీవ్‌, ధ్రువతేజ్‌



బద్రి, తిర్మన్‌పల్లి



బాస వెంకట్‌రాజు, ప్రతాప్‌ (ప్రగతినగర్‌)



శివపుత్ర గణేశ్‌ మండలి (బర్దీపూర్‌)



గంగాస్థాన్‌లో..



జంగం మోహన్‌ (గాదేపల్లి)

డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెకు వెళ్తాం



డీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆపరేటర్లు

సుభాష్‌నగర్‌: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఈ–పంచాయతీ కంప్యూటర్‌ ఆపరేటర్ల డిమాండ్లు నెరవేర్చాలని, లేకుంటే సమ్మెకు వెళ్తామని తెలంగాణ ఈ పంచాయతీ టెక్నికల్‌ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నరహరి పేర్కొన్నారు. ఈ మేరకు జెడ్పీ సీఈవో గోవింద్‌నాయక్‌, డీపీవో జయసుధకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నరహరి మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖలోని టెక్నికల్‌ వ్యవస్థలో 13 ఏళ్లుగా పని చేస్తున్న జిల్లా ప్రాజెక్ట్‌ మేనేజర్లు, ఈ–పంచాయతీ ఆపరేటర్లకు పే స్కేల్‌ అమల్జేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ఉద్యోగులకు ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్‌ చేశారు. సంఘం నాయకులు శివాజీ, సురేష్‌, కిరణ్‌, సతీష్‌, ప్రశాంత్‌కుమార్‌, రాజశేఖర్‌, నితీష్‌, శ్రీనివాస్‌, ఉమా, అనూష, కల్పన పాల్గొన్నారు.

భళా.. కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య పాఠశాల విద్యార్థులతో మండలి నిర్వాహకులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: వినాయక నవరాత్రుల్లో భాగంగా మహాలక్ష్మినగర్‌ బ్యాంక్‌కాలనీ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద గురువారం రాత్రి నృత్య పాఠశాల విద్యార్థులు చేసిన కూచిపూడి నృత్యరూపక ప్రదర్శన ఆకట్టుకుంది.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

'ఆయుష్మాన్‌భవ ఆరోగ్య మేళా'కు విశేష స్పందన



ఆరోగ్యమేళా ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన మెగా ఆరోగ్యమేళాకు విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి సుదర్శనం హాజరై ఆరోగ్యమేళాను ప్రారంభించారు. సీహెచ్‌సీ పరిధిలోని డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల ప్రజలు మేళాను సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు గ్రామస్తులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీవో విశాల, జిల్లా ఆరోగ్య విద్య బోధకులు ఘన్‌పూర్‌ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో వై.శంకర్‌, ప్రకాశ్‌, వేణుగోపాల్‌, ఎంపీహెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల ఫీజు గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ స్కూల్‌ పదో తరగతి, ఇంటర్‌ పరీక్షల ఫీజును అదనపు రుసుంతో చెల్లించేందుకు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ శుక్రవారం తెలిపారు. పదో తరగతి వారికి రూ. 1650, ఇంటర్‌ వారికి రూ. రెండు వేలు చెల్లించి పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. ఆన్‌లైన్‌, మీసేవ సెంటర్లలో ఫీజులు చెల్లించాలని కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- ఇద్దరు మట్కా నిర్వాహకులపై కేసు నమోదు
- సీపీ సత్యనారాయణ



వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న డీసీపీ జయరామ్‌, ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి: శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఉదయం 4 నుంచి 8 గంటల వరకు పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలోని రామ్‌నగర్‌, నెహ్రూనగర్‌, సారంగపూర్‌లో సీపీ ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ కాంటాక్ట్‌ ప్రోగ్రామ్‌' నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వాహనాదారులు ట్రాఫిక్‌ నిబంధనలు పాటించి, హెల్మెట్‌ ధరించాలని సూచించారు. సైబర్‌ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. కాలనీవాసులు తమ కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలు 82, ఆటోలు 31, కార్లు 2, లారీలు 2 స్వాధీనం చేసుకున్నారు. మట్కా నిర్వాహకులు అబ్దుల్‌ సాజిద్‌, సయ్యద్‌ షాదుల్లాలపై మట్కా కేసులు, రెండు బెల్ట్‌ షాపులపై దాడి చేసి 248 లిక్కర్‌ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. అక్రమంగా మొరంను తరలిస్తున్న లారీని సీజ్‌ చేసి తహసీల్దార్‌కు అప్పగించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ ఎస్‌. జయరాం, ఏసీపీ కిరణ్‌ కుమార్‌, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది, సర్పంచులు అమానుల్లా, జిలానీ, ఎంపీటీసీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



రిజిస్ట్రార్‌ యాదగిరికి సమ్మె నోటీసు అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమను రెగ్యులరైజ్‌ చేయాలని, అక్టోబర్‌7వ తేదీలోగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో సమ్మె చేస్తామని తెయూ అవుట్‌సోర్సింగ్‌ సిబ్బంది పేర్కొన్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్‌ ఎం.యాదగిరికి సమ్మె నోటీసును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.భూమన్న, అవుట్‌సోర్సింగ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ అధ్యక్ష, కార్యదర్శులు బి.సురేశ్‌, పి.బికోజీ మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్‌ సిబ్బందిని రెగ్యులర్‌ చేయాలని ఉన్నత విద్యాశాఖాధికారులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులను కలిసి ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెనోటీసు అంశాన్ని ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్తానని రిజిస్ట్రార్‌ తెలిపారు. యూనియన్‌ గౌరవ అధ్యక్షుడు ఎల్‌బీ రవికుమార్‌, నరేశ్‌, సుధీర్‌, మధులిక, మౌనిక, శ్రీధర్‌, రమేశ్‌, సతీశ్‌గౌడ్‌, గులాబ్‌, సురేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వ్యాపారులపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని పవన్‌టాకీస్‌ వెనుక ప్రాంతంలో ముగ్గురు గంజాయి వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి కిలో ఎండు గంజాయి, రసాయనాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

పోలీసులకు చైన్‌స్నాచర్‌ అప్పగింత

ఖలీల్‌వాడి : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌సమీపంలో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన మేరకు వివరాలు.. ఇందల్వాయి మండలం లోలం గ్రామానికి చెందిన ఏశాల స్వప్న నగరంలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చింది. తిరుగు ప్రయాణంలో బస్టాండ్‌ వద్ద పండ్లు కొనుగోలు చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన దుండగుడు ఆమె మెడలోని చైన్‌ను దొంగిలించే ప్రయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌ మండలం టేకుమట్లకు చెందిన మహ్మద్‌ మొయినొద్దీన్‌ చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డాడని, అతడిని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఇందల్వాయి: సిర్నాపల్లి రైల్వే స్టేషన్‌ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన రాంసారం బాబయ్య, బొమ్మిని చరణ్‌ బైక్‌పై ఇందల్వాయి నుంచి సిర్నాపల్లికి వస్తుండగా బైక్‌ అదుపు తప్పి కిందపడిపోయారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా బాబయ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డ్‌ మృతి



లింగం (ఫైల్‌)

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన హోంగార్డ్‌ లింగం(50) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. నవీపేట పీఎస్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న లింగం కొంత కాలంగా బీపీ, షుగర్‌, కాలేయ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. నగరంలోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు?

సిరికొండ: మండలంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న కత్తిపోట్ల ఘటనలో పలువురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అన్సర్‌ ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌ కాలాపత్తర్‌కు చెందిన రౌడీషీటర్‌ అసద్‌తో పాటు నిజామాబాద్‌కు చెందిన రహమాన్‌ తదితరులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ధర్పల్లి సీఐ సైదాను వివరణ కోరగా దాడి కేసుపై విచారణ చేపడుతున్నామని ఘటనతో సంబంధం ఉన్న వారందరిని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు.

పలువురిపై కేసు నమోదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. తాడ్వాయి పోలీసులు రవి, నిరంజన్‌ పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా మండల శివారులో గాంధారి మండలంలోని గుడిమెట్‌కు చెందిన ఆర్ల శివాజీ, బొంపల్లికి చెందిన హరీశ్‌ మరికొందరు కారు ఆపి మద్యం సేవిస్తున్నారు. రోడ్డు పక్కన మద్యం తాగొద్దని వారికి సూచించారు. దీంతో శివాజీరావు, హరీశ్‌ పోలీసులను బెదిరించి నెట్టివేశారు. కానిస్టేబుల్‌ రవి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేయగా మరొకరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

భిక్కనూరు: వృద్ధురాలిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గోసు ఎల్లవ్వ (75) ఆరోగ్య నిమిత్తం స్థానిక ఆసుపత్రిలో చూయించుకొని ఇంటికి వెళ్తుండగా కరీంనగర్‌ నుంచి బస్వాపూర్‌ మీదుగా వెళ్తున్న ఓ సిమెంట్‌ లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో ఎల్లవ్వ ఘటన స్థలిలోనే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. టోల్‌ పన్ను ఎగ్గొటేందుకు పలు పెద్ద వాహనాలు ఇదే ప్రాంతంలో సంచరిస్తున్నాయని వీటిని అధికారులు నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..

బిచ్కుంద(జుక్కల్‌): మండలంలోని సీతారాంపల్లిలో విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందినట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మణ్‌జాదవ్‌ (40) తన పొలంలో పంటను అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్‌ కంచెపై పడడంతో మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుంటలో పడి ఒకరు..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్‌కు చెందిన ఒకరు ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన సుంకరి బాలయ్య(55) కాలకృత్యాలు తీర్చుకునేందుకు కుంటకు వెళ్లగా కాలుజారి పడిపోయి మృతి చెందాడు. మృతుడి భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పండుగకు వస్తుండగా ప్రమాదం

- చికిత్స పొందుతూ యువకుడి మృతి



అఖిల్‌ (ఫైల్‌)

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన అఖిల్‌(23) హైదరాబాద్‌లోని దుండిగల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా దుండిగల్‌ ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఏఎస్సై లక్ష్మణ్‌ ఘటన స్థలానికి చేరుకొని అఖిల్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అఖిల్‌ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మర్కల్‌లో ఒకరు..

సదాశివనగర్‌: మండలంలోని మర్కల్‌ గ్రామంలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మర్కల్‌కు చెందిన బండారి రవి(37) గొర్లను మేపుతూ గ్రామ సమీపంలోని చెరువు కట్టపై వెళ్తుండగా అకస్మాత్తుగా తేనేటీగలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. చికితస పొందుతూ రవి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య



భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన జీపీ కార్మికుడు పరశురాం (30) కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయికుమార్‌ శుక్రవారం తెలిపారు. కొన్నేండ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్న పరశురాం గదిలో నిద్రించగా భార్య సుజాత కొద్ది సేపటికి వెళ్లి చూసే సరికి ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువకుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఫేస్‌బుక్‌



ఖలీల్‌వాడి: ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువకుడిని ఫేస్‌బుక్‌ ప్రొఫైల్‌ పిక్‌ తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. ప్రొఫైల్‌ పిక్‌ మార్చడంతో పోలీసులు యువకుడిని పట్టుకున్న ఘటన నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌ 18 నెలల క్రితం అదృశ్యమయ్యాడు. హైదరాబాద్‌లో ఇంటర్‌ కాలేజీకి వెళ్తూ కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పుడు పోలీసులు కేసు నమోదు చేశారు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తాజాగా ఆ యువకుడు ఫేస్‌బుక్‌లో ప్రొఫైల్‌ పిక్‌ మార్చడంతో పోలీసులు సాంకేతిక సాయంతో ప్రయత్నాలు చేపట్టారు. ఫోన్‌ నంబర్‌ను ట్రాక్‌ చేయగా ఖమ్మంలో ఉన్నట్లు గుర్తించి విష్ణువర్ధన్‌ను పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.

కోళ్లఫారంలో చోరీ

ఆర్మూర్‌టౌన్‌: మండల సమీపంలోని బాలాజీ కోళ్ల ఫారంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటర్లను గురువారం రాత్రి చోరీ చేశారు. కోళ్లఫారంలో గ్రైండింగ్‌ మిషన్‌కు సంబంధించిన 5 హెచ్‌పీ, 2హెచ్‌పీ, 1హెచ్‌పీ మోటార్లను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు రాజేంద్రగౌడ్‌ తెలిపారు. సుమారు రూ. లక్ష విలువ చేసే సామన్లను అపహరించినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీకి చెందిన షేక్‌ రబియాబీ (70) అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో నరేశ్‌ తెలిపారు. ఈ నెల 15న పింఛన్‌ డబ్బులు తెచ్చుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు గౌస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.